క్లుప్తంగా

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వ పాఠశాలలో అన్నిరకాల సదుపాయాలు ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని పాఠశాల హెచ్ఎం సంగుబాయి అన్నారు. తాడ్వాయి మండలంలోని కృష్ణాజీవాడిలో ప్రభుత్వ పాఠశాలలో సోమవారం పాఠశాలల అభివృద్ధి, విద్యాబోధనపై విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ పాఠశాలలో అన్నిసౌకర్యాలున్నాయన్నారు. మాజీ సర్పంచ్ భూషణం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలను సంఘాల్లో చేర్చుకోవాలి



రాజంపేట : గ్రామాల్లోని మహిళలను మహిళా సంఘాల్లో చేర్చుకోవాలని ఏపీఎం సాయిలు అన్నారు. సోమవారం మండల మహిళా సమాఖ్య భవనంలో గ్రామ సంఘ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీసీ లు శ్రీనివాస్, సాయిలు, భాగయ్య, రమేష్, స్వామి, అకౌంటెంటు ప్రశాంతి పాల్గొన్నారు.

'మాట నిలబెట్టుకున్న సీఎం'



భిక్కనూరు : ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి రైతుల రుణాలను ఏకకాలంలో మాఫీ చేయడానికి చర్యలు తీసుకున్నారని పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎంపీపీ తొగరి సుదర్శన్ అన్నారు. భిక్కనూరులో వారు మాట్లాడుతూ రాష్ట్ర క్యాబినెట్ మీటింగ్‌లో రుణమాఫీపై నిర్ణయం తీసుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింగరావ్, స్వామి, అమృత శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన యువకవి



మాచారెడ్డి : మండలంలోని సోమారంపేట గ్రామానికి చెందిన యువ కవి క్లెం నవీన్ రెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం మాజీ సీఎం కేసీఆర్‌ను ఆయన నివాసంలో కలిశారు.కేసీఆర్‌పై యోధ పేరిట ఓ కవితా సంకలనాన్ని రాసిన నవీన్ ను కేసీఆర్ అభినందించారు.

ప్లాస్టిక్ బ్యాగులపై స్పెషల్ డ్రైవ్

ఎల్లారెడ్డి : ప్లాస్టిక్ బ్యాగులు నిరోధించేందుకు ఎల్లారెడ్డి మున్సిపల్ సిబ్బంది సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా వారు పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీ చేసి ప్లాస్టిక్ బ్యాగులను స్వాధీనపర్చుకున్నారు. దుకాణాలలో ప్లాస్టిక్ బ్యాగ్‌లను వాడితే కఠినమైన చర్యలు తీసుకొని జరిమానాలు విధిస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

రామాలయానికి స్లాబ్



మాచారెడ్డి : మండలంలోని పాల్వంచలో ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కామారెడ్డి ఎమ్మెల్యే కాటి పల్లి వెంకట రమణారెడ్డి సోమవారం రామాలయానికి స్లాబ్ వేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కేవీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఓబీసీ అధ్యక్షులు బాల్ రాజు,కార్యదర్శి వడ్ల నరసింహ చారి మండల అధ్యక్షులు పోసు అనిల్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీను మండల ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి,గ్రామ అధ్యక్షులు రాజేందర్ బీజేవైఎం మండల అధ్యక్షుడు సత్యం, బూత్ అధ్యక్షుడు అశోక్, ఆలయ కమిటీ అధ్యక్షులు గాల్ రెడ్డి, కోశాధికారి శివుని గౌడ్ తదితరులున్నారు.

మండల పరిషత్ సభ్యులకు సన్మానం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట ఎంపీపీ వినీతరెడ్డి, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులను సోమవారం ఎంపీడీవో పర్బన్న ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం వచ్చేనెల ముగియనుంది.

తడి, పొడి చెత్త సేకరణలో నిర్లక్ష్యం

- ప్రచారానికే పరిమితమైన అధికారగణం
- నిరుపయోగంగా డీఆర్‌సీ



ఎల్లారెడ్డిలో నిరుపయోగంగా మారిన కంపోస్టు షెడ్

ఎల్లారెడ్డి : చెత్త బండి వచ్చిందమ్మా.. మీ వద్ద ఉన్న తడి-పొడి చెత్తను వేరు వేరుగా వేయండమ్మా అంటూ మున్సిపల్ వాహనం మైక్‌లో చెవులు ఊదరగొట్టేలా చేస్తున్న ప్రకటన కేవలం ప్రచారానికే పరిమితమైంది. తడి చెత్త ద్వారా కంపోస్ట్ ఎరువు, పొడి చెత్త ద్వారా రీసైక్లింగ్ చేయాలని గత ప్రభుత్వం సంకల్పించింది. వ్యర్థాలను అమ్మడం ద్వారా మున్సిపాలిటీలకు, జీపీలకు ఆదాయ వనరులు కల్పించాలన్న ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులు, కంపోస్ట్ షెడ్లు, డీఆర్‌సీ సెంటర్లు, తడి-పొడి చెత్త సేకరణకు ప్రత్యేక వాహనాల ఆర్భాటం ప్రచారానికే పరిమితమైంది. ఇళ్ల నుంచి చెత్త సేకరణ నుంచే తడి-పొడి చెత్తలను వేరుగా సేకరించాలన్న ఉద్దేశ్యంతో మున్సిపాలిటీ, జీపీలు ప్రతీ ఇంటికీ వేర్వేరు రంగుల్లో రెండు డస్ట్ బిన్లు ఉచితంగా అందజేశారు. తడి-పొడి చెత్తను వేరు వేరుగా సేకరించేందుకు ప్రతీ మున్సిపాలిటీల పరిధిల్లో వేరు వేరు అరలు ఉన్న ప్రత్యేక వాహనాలను కొనుగోలు చేశారు. ఆరంభ శూరత్వంలా మొదట్లో ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారమే చెత్త సేకరణ జరిగింది. ప్రజలు కూడా తడి-పొడి చెత్తలను వేరు వేరు డస్ట్‌బిన్లలోనే తమ ఇళ్ల ముందుకు వస్తున్న చెత్త సేకరణ వాహనాలకు చెత్తను అందజేశారు.

చెత్తకు నిప్పు..

అయితే తాము తడి-పొడి చెత్తను వేరు వేరుగా అందజేసినా పారిశుద్ధ్య సిబ్బంది రెండింటినీ వాహనంలో ఒకటే దగ్గర వేయడాన్ని గమనించిన ప్రజలు వేరు వేరుగా చెత్తను వేయడం మానేశారు. పారిశుధ్య సిబ్బంది కొరత పేరుతో మున్సిపాలిటీ, జీపీ అధికారులు తడి-పొడి చెత్తను వేరు చేసి వాటి ద్వారా ఆదాయం పొందే ప్రక్రియకు పక్కకు పెట్టేశారు. గ్రామాలు, పట్టణాలలో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి నిప్పు పెడుతున్నారు. దీని వల్ల వెలువడుతున్న రసాయనాలు వాయు కాలుష్యాన్ని కలగ జేస్తున్నాయి.

విద్యార్థులకు కష్టం..

ఎల్లారెడ్డి పట్టణం నుంచి సేకరించిన చెత్త కోసం మోడల్ స్కూల్ వెనక ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులో చెత్తను కాలుస్తుండటం వల్ల హాస్టల్ పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం ఏర్పడి విద్యార్థుల ప్రాణాల మీదకు తెస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా డంపింగ్ యార్డుల్లో చెత్తను కాల్చడం వల్ల అస్వస్థతకు గురవుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. డంపింగ్ యార్డులకు తరలించిన చెత్తను ఉపయోగించుకునేందుకు మున్సిపాలిటీల పరిధుల్లో ఏర్పాటు చేస్తామన్న బయో మైనింగ్ ప్లాంట్ల ప్రతిపాదన టెండర్ దశ కూడా దాటలేదు. తడి-పొడి చెత్తను వేరు చేసి ఆదాయ వనరుగా మార్చుకునే ప్రక్రియ సాధ్యపడని నేటి పరిస్థితుల్లో కనీసం డంపింగ్ యార్డులను జనావాసాలకు దగ్గర కాకుండా అటవీ ప్రాంతాలలో పెడితే బాగుంటుందన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది.

సమస్యలపై స్పందించిన అధికారులు



పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



మురికికాలువను శుభ్రం చేయిస్తూ..

సాక్షి ఎఫెక్ట్..

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో రక్షిత మంచినీటి ట్యాంక్ వద్ద భగీరథ పైప్‌లైన్ లీకేజీపై 'సాక్షి' లో సోమవారం ప్రచురితమైన కథనానికి భగీరథ అధికారులు స్పందించారు. లీకేజీకి మరమత్తులు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీధర్ రెడ్డి తెలిపారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రిడ్ అధికారులు పాల్గొన్నారు.

మురికి కాలువ శుభ్రం

బీబీపేట : మండల కేంద్రంలోని ఇంద్రనగర్ కాలనీలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో 'మురికినీటితో అవస్థలెన్నో' అనే శీర్షికన సోమవారం కథనం ప్రచురితం కాగా జీపీ అధికారులు స్పందించారు. దీంతో 300 మీటర్ల వరకు జేసీబీ సాయంతో వ్యవసాయ భూముల వరకు కాలువ తీశారు. అనంతరం పారిశుధ్య సిబ్బంది సాయంతో చెత్తాచెదారంను తీసి ట్రాక్టర్ ద్వారా బయటకు తీసివేశారు. కాలనీ వాసులకు ఇబ్బంది కలుగకుండా ప్రస్తుతానికి కాలువను సరిచేశామని, త్వరలోనే మురికి కాలువ నిర్మాణానికి పై అధికారులకు పంపించామని జీపీ కార్యదర్శి రమేష్ తెలిపారు. కారోబార్ సిద్ధిరాంలు తదితరులు ఉన్నారు.

పెద్దవాన పడితే రోడ్డు బందే..



రామారెడ్డి : రామారెడ్డి శివారులోని గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. నాలుగైదు నెలల క్రితం ప్రారంభమైన బ్రిడ్జి నిర్మాణ పనులు వర్షాకాలం ప్రారంభమైన పనులు పూర్తికాకపోవడంపై ప్రజల అసహనం వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి వైపు వెళ్లాలంటే వాహనదారులందరికీ ఇది ఒకటే ప్రధాన రహదారి. వర్షాకాలంలో పెద్దవాన పడితే బ్రిడ్జి నిర్మాణం కారణంగా పక్కన నుంచి ఏర్పాటు చేసిన మట్టి రోడ్డు నుంచి నీళ్లు పారితే కామారెడ్డికి వెళ్లే మార్గం పూర్తిగా నిలిచిపోయే ప్రమాదముంది. వానలు పడక ముందే పనులను పూర్తి చేసి బ్రిడ్జిని అందుబాటులోకి తేవాలని ప్రజల కోరుతున్నారు.

సంఘాలు అభివృద్ధి చెందాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : గ్రామాల్లో ఉన్న అర్హులైన సంఘాలకు రుణాలు ఇప్పించి, ఆ సంఘాలు మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూడాలని ఐకేపీ ఏపీఎం రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపి కార్యాలయంలో సోమవారం మండల సమాఖ్య అధ్యక్షురాలు యశోదబాయి అధ్యక్షతన మండల సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న శ్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతినెల 10వ తేదీలోపు చెల్లించిన సంఘాలకు మాత్రమే పావులా వడీ వర్తిస్తుందన్నారు. ఈ సమావేశంలో సీసీలు రమేష్‌గౌడ్, సంజీవులు, నర్సింలు తదితరులున్నారు.

డీఈవో, ఎంఈవోలపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ గేటు ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్ : జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూళ్లు చేస్తున్న పట్టించుకోని డీఈవో, ఎంఈవోలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రోహిత్ మాట్లాడుతూ జిల్లాలో గతేడాదికి 25శాతం ఫీజు పెంచి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా హస్టల్ కన్వీనర్ ఖలీల్, వరుణ్, శివ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి టౌన్ : జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం డీఈవో ఎస్.రాజుతో వాగ్వాదానికి దిగారు. కలెక్టరేట్‌లో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా రూ. 50 వేల నుంచి రూ. లక్షకు పైగా ఫీజులను వసూళ్లు చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేరన్నారు. 2009 సెక్షన్ 21 ప్రకారం గవర్నింగ్ బాడీ ఏర్పాటు చేసి ఫీజులను తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఈవోకు వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, బీవీఎం, బీడీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు ఆజాద్ తదితరులున్నారు.

కరాటే క్రీడాకారులకు సన్మానం



భిక్కనూరు : దోమకొండకు చెందిన కామిండ్ల నవీన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన తెలంగాణ స్థాయి కరాటే పోటీల్లో ఉత్తీర్ణత సాధించి బ్లాక్ బెల్ట్ సాధించిన జంగంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎం.కావేరీ, రూపశ్రీను పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు గఫూర్‌శిక్షక్‌లు మాట్లాడుతూ కరాటేశిక్షకులు సంతోష్‌కుమార్ శిక్షణలో బ్లాక్‌బెల్ట్ సాధించడం అభినందనీయమన్నారు.

సమాచారం..

నేడు ఎర్రాపహాడ్‌లో రైతు నేస్తం

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని ఎర్రాపహాడ్‌లో రైతు వేదిక కార్యాలయంలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏవో శ్రీకాంత్ తెలిపారు. వ్యవసాయం సాగులో పాటించాల్సిన మెళకువలు, వ్యవసాయంకు సంబంధించిన సూచనలు రైతులకు తెలియజేస్తామన్నారు.

మద్నూర్‌లో..

మద్నూర్(జుక్కల్) : వ్యవసాయానికి సంబంధించిన మెళకువల కోసం రైతులు రైతునేస్తాం కార్యక్రమంలో పాల్గొనాలని మండల వ్యవసాయ అధికారి రాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఉదయం 9 గంటలకు విత్తనాల ఎంపికపై అవగహన కార్యక్రమం ఉంటుందన్నారు.

నస్రుల్లాబాద్‌లో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలో గల రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి నరేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా విత్తనాల ఎంపికపై అవగాహన, ప్రస్తుత వానాకాల పంటలలో సూచనలను శాస్త్రవేత్తలతోను, అధికారులతోను సూచనలు చేస్తారన్నారు.

నేడు బాన్సువాడలో తైబజార్ వేలం

బాన్సువాడ : బాన్సువాడ బల్దియా తైబజార్‌కు మంగళవారం వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీహరి రాజు తెలిపారు. 2023-2024కు గాను తైబజార్ వేలం వేస్తున్నామన్నారు. రోజువారీ సంత, వారంతపు సంత, మేకల సంత, పశువుల దాఖలుకు వేలం వేయనున్నట్లు ఆయన అన్నారు.

ఉచిత వైద్య శిబిరం..

బీబీపేట: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో 'మెగా ఉచిత ఆరోగ్య వైద్యశిబిరం నేడు మండల కేంద్రము లోని వాసవి క్లబ్ లో నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మెన్ నాగరాజు గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో 60 సంవత్సరాలు పైబడిన వారికి, వికలాంగులకు నిర్వహించబడుతుందన్నారు. ఈ శిబిరంలో ఈసీజీ, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించబడునని పేర్కొన్నారు. అవసరం ఉన్నవారికి మెడిసిన్స్ ఇవ్వబడతాయని ఉదయం పది గంటలకు హాజరు కావాలని తెలిపారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్ : నిరుద్యోగ సమస్యలపై పోరాటం చేస్తున్న బీజేవైఎం నాయకులపైన జరిగిన దాడిని నిరసిస్తూ జిల్లా బీజేవైఎం శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఎదుట రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నంది వేణు మాట్లాడుతూ టీజీపీఎస్సీ చైర్మన్ కార్యాలయం ఎదుట శాంతియుతంగా ధర్నా చేస్తున్న బీజేవైఎం నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. గ్రూప్- 1 ప్రిలిమ్స్ రాసిన అభ్యర్థులకు కేటగిరైజేషన్ ప్రకారం భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్- 2, గ్రూప్- 3 ఉద్యోగ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని వెంటనే నిర్వహించి, జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేసారు. బీజేవైఎం నాయకులు నరేష్, లింగం, మనోజ్, భరత్, నరేష్, సాయి, రాజగోపాల్, నవీన్ తదితరులున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



బాన్సువాడ : బాన్సువాడ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు బాన్సువాడ ఇన్‌చార్జి ఖలీల్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు పీఎఫ్ కట్టడడం లేదని, వెంటనే ఐదు సంవత్సరాల పీఎఫ్‌ను కట్టాలని అన్నారు. ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బుజ్జిగారి సాయిలు, రాజులు తదితరులు ఉన్నారు.

కబ్జాపై విచారించండి



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన పలువురు తమ గ్రామంలో కబ్జాకు గురైన భూమిపై విచారణ చేయాలని సోమవారం ఉప తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మారం గ్రామస్తులు అందరు కలిసి చెరువు కింద సర్వే నంబర్ 91లో 10 గుంటల భూమిని హనుమాన్ మందిర్ కోసం విడిచిన భూమి కబ్జాకు గురైందన్నారు. కార్యక్రమంలో ధర్మారం గ్రామస్థులు, పాండు పటేల్, కృష్ణ, హన్మండ్లు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై కాంగ్రెస్ సంబురాలు





భిక్కనూరులో సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నేతలు, అడ్లూర్‌ఎల్లారెడ్డిలో..



మాచారెడ్డిలో..



లింగంపేటలో..

రైతులకు ఒకేదఫాలో రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



బిచ్కుందలో..



ఎల్లారెడ్డిలో..

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలో ప్రధాన రహదారికి సంబంధించి విస్తరణ పనులు మొదలవ్వనున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగుచర్యలు చేపట్టాలని నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ ఎంపీటీసీ రాజ్‌దాస్‌తోపాటు ఇతర సభ్యులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వినీతరెడ్డి అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ ఏఈ విష్ణు నివేదికను చదువుతూ త్వరలో నాగిరెడ్డిపేట మండలంలో జరుగనున్న ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో ప్రధాన పైపులైన్ ధ్వంసం అయ్యే అవకాశం ఉందన్నారు. దీనిపై తాండూర్ ఎంపీటీసీ రాజ్‌దాస్ మాట్లాడుతూ తాగునీటికి ఇబ్బంది రాకుండా చూడాలన్నారు. స్కూళ్లలో పనులను ఈనెల 26లోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారని ఎంఈవో వెంకటేశం తెలిపారు. జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేసేలా తీర్మానం చేయాలని సభ్యులు కోరారు. పంటకాలువల్లో పూడికతీత పనులు చేయించాలని ఆత్మకూర్ ఎంపీటీసీ శ్రీనివాస్ సూచించారు.

ఇంటర్ ఫలితాల్లో ఎస్ఆర్‌కే విద్యార్థుల ప్రతిభ



కామారెడ్డి టౌన్ : ఇంటర్మీడియేట్ బోర్డు సోమవారం ప్రకటించిన ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్‌కే జూనియస్ కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటా రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు. ఎంపీసీ ఫస్టియర్‌లో ఇందువర్ష 467 మార్కులతో, బైపీసీలో కె.వి పూజ 436 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించారు. విద్యార్థులను కామారెడ్డి జిల్లా నోడల్ ఆఫీసర్ షేక్ సలాం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్కే గ్రూప్ ఆఫ్ కరస్పాండెంట్, సీఈవో డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి, డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ దత్తాత్రి, కళాశాల ప్రిన్సిపాల్ నరేష్ కుమార్ , తిరుపతి రెడ్డి, డీన్ అకాడమిక్ నవీన్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

అటవీశాఖ కార్యవర్గం ఎన్నిక



నిజాంసాగర్(జుక్కల్) : జిల్లా అటవీశాఖ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడిగా ఎస్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మహమ్మద్ నగర్ మండలంలోని సింగితం గ్రామ బీట్ అధికారిగా పనిచేస్తున్న శ్రీనివాస్ ఉపాధ్యక్షుడిగా రెండవసారి ఎన్నిక కావడం పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలపై అవగాహన



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో సోమవారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి డివిజన్‌లోని ఆయా పోలీస్ స్టేషన్‌లకు చెందిన ఎస్సైలు, సిబ్బందికి డ్రంక్ అండ్ డ్రైవ్‌పై డీఎస్పీ శ్రీనివాస్‌లు అవగాహన కల్పించారు. అనంతరం రాత్రి లింగంపేటలోని పలు కూడళ్లలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. అలాగే ఎల్లారెడ్డి-కామారెడ్డి రోడ్డుపై వాహనాల తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీఐ రవీందర్, ఎల్లారెడ్డి, గాంధారి, నాగిరెడ్డిపేట, సదాశివనగర్, లింగంపేట, తాడ్వాయి మండలలాలకు చెందిన ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కోతుల బెడదను తొలగించండి



ఎల్లారెడ్డి రూరల్ : ఎల్లారెడ్డిలో ప్రజలకు ప్రాణాంతకంగా మారిన కోతుల సమస్యను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజుకు బీఎస్పీ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలో కోతుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయి మనుషులపై దాడులు చేస్తున్నాయని వారు ఆరోపించారు. పట్టణంలో విపరీతంగా పెరిగిపోయిన కోతులను పట్టుకొని అటవీప్రాంతంలో వదిలిపెట్టేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పట్టణ అధ్యక్షులు మర్ల సాయిబాబా తదితరులు ఉన్నారు.

వ్యవసాయ పద్ధతులపై అవగాహన



బాన్సువాడ రూరల్ : మండలంలోని సంగోజీపేట్ గ్రామంలో సోమవారం పద్మపాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు, నీటివనరుల వినియోగంపై ఆ సంస్థ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి , కోఆర్డినేటర్ భూపతితో కలిసి గ్రామస్తులకు వివరించారు. అధిక రసాయన ఎరువుల వాడటం వల్ల జరిగే అనర్థాలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ విక్రమ్‌రెడ్డి, గ్రామ వీడీఎస్ సభ్యులు రఘునాథ్‌రావు, బాలరాజ్, నరేష్, సాయిలు, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.